# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 28-10-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్రతుపానుగా "మొంథా" బలపడిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.**
2. **తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహిస్తున్నారు.**
3. **క్షేత్ర స్థాయిలో రైతులకు పంట నష్టం తగ్గించేలా ముందస్తు నష్ట నివారణ చర్యలు చేపట్టామని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**
4. **ఆకస్మిక వరదల కారణంగా గండ్లు పడే చోట త్వరితగతిన పునర్ నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు చేశామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**
5. **ప్రపంచ యానిమేషన్ అవగాహనా దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్రతుపానుగా మొంథా తుపాను బలపడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతానికి మచిలీపట్నంకి 160 కిమీ, కాకినాడకి 240 కిమీ, విశాఖపట్నంకి 320 కిమీ దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. ఈరోజు రాత్రికి కాకినాడ– మచిలీపట్నం మధ్య తీవ్రతుపానుగా తీరం దాటే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

..వాయిస్... 30 సెకన్లు

--------------------------

మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా తీరప్రాంత జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు మండలాల్లో ఈదురు గాలులు వీస్తున్నాయి. విశాఖపట్నం జిల్లాలో రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. విశాఖకు వచ్చే 16 రైళ్లు రద్దయ్యాయి. విమాన సర్వీసులు నిలిపివేశారు.

గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ,

మేడికొండూరు మండలాల్లోని ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం హార్బర్‌లో ఐదో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశామని మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొంథా తుపాను ప్రభావంపై ఈరోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్నారు. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

అలాగే అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి తుపాను పరిస్థితిని మంత్రి నారా లోకేష్ సమీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. తుఫాను ప్రభావంతో వివిధ పంటలకు వాటిల్లిన నష్టంపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

---------------------------

మొంథా తుపాను తీవ్రతను ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు సహకారం అందించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని ఒక ప్రకటనలో వెల్లడించారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, వ్యవసాయ, ఉద్యాన పంటల ప్రాథమిక నష్టం అంచనా నివేదికలు సేకరించామన్నారు. క్షేత్ర స్థాయిలో పంట నష్టం తగ్గించేలా ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు నష్ట నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు. తుఫాను అనంతరం పంట నష్టం వాటిల్లిన ప్రతి రైతును ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

మొంథా తీవ్ర తుపాను ప్రభావంతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశంలో మాట్లాడుతూ.. వరదల కారణంగా గండ్లు పడే చోట త్వరితగతిన పునర్ నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కాలువలు, జలాశయాలు, డ్రైనేజీలు పొంగకుండా వరద నిర్వహణను చేపడుతున్నామని మంత్రి తెలియజేస్తూ...

..వాయిస్.. 32 సెకన్లు

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా మొంథా తుపాను ప్రభావంతో కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 233 మండలాలు, ఒక వెయ్యి 419 గ్రామాలు, 44 మున్సిపాలిటీలపై తుపాను ప్రభావం ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే 2 వేల 194 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

19 జిల్లాల పరిధిలోని 54 రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. జిల్లాల్లో కమ్యూనికేషన్ కోసం 16 శాటిలైట్ ఫోన్లు, 35 డీఎంఆర్ సెట్లు ఏర్పాటు చేశామని తెలిపింది.

-------------------------

తుపాను ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు విపత్తు నిర్వహణ బృందాలు ఆయా ప్రాంతాలకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా కృష్ణా జిల్లా మచిలీపట్నానికి జాతీయ విపత్తు నిర్వహణ బృందం–ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. తుపాను ప్రభావానికి గురయ్యే ప్రాంతాలను గుర్తించామని, సహాయక చర్యల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎన్డీఆర్ఎఫ్ కమాండర్ ఈశ్వరరావు తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

-------------------------

కాకినాడ జిల్లాలో మొంథా తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సగిలి షన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో తుపాను పర్యవేక్షణ ప్రత్యేకాధికారి కృష్ణతేజతో కలిసి తుపాను సహాయక చర్యలపై ఈరోజు సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను, తాళ్లరేవు మండలంలోని హోప్‌ఐలాండ్ నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. కోరింగ అభయారణ్యం, ఉప్పాడ– కాకినాడ బీచ్‌రోడ్డును పూర్తిగా మూసివేశామని చెప్పారు. ప్రజలు అత్యవరసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని సూచించారు.

-------------------------

ప్రపంచ యానిమేషన్ అవగాహనా దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. స్థిరంగా ఉన్న చిత్రాలను సాంకేతిక ప్రక్రియతో కదిలించే విధంగా తీర్చిదిద్దడాన్నే యానిమేషన్ అంటారు. 1892వ సంవత్సరం అక్టోబర్ 28వ తేదీన ప్యారిస్ నగరంలోని గ్రెవెన్ మ్యూజియంలో చార్లెస్ ఎమిలే రెనాడ్ అనే శాస్త్రవేత్త తన మొట్టమొదటి యానిమేషన్ చిత్రాన్ని ప్రదర్శించిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజున అంతర్జాతీయ యానిమేషన్ అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. యానిమేషన్ దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ...

వాయిస్ (24 సెకన్లు )

-------------------------

మొంథా తీవ్ర తుపాను ఈరోజు తీరం దాటనున్నందున ఆ సమయంలో విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ – ఏపీఈపీడిసిఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు ప్రాంత పరిధిలో ఉన్న జిల్లాల్లో సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. తుపాను ప్రభావం తక్కువగా ఉన్న జిల్లాల నుంచి ముందుగానే సిబ్బందిని రప్పించి ఆయా ప్రాంతాల్లో సన్నద్ధంగా ఉంచామని వెల్లడించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ... తదనుగుణంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

=====================